క్లుప్తంగా

ఎమ్మెల్యేను కలిసిన పాదయాత్రికుడు



ఎమ్మెల్యే రామిరెడ్డితో జిలానీబాషా

బనగానపల్లె: మార్కాపురం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేస్తున్న షేక్ జిలానీ బాషా సోమవారం బనగానపల్లెకు చేరుకొని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని ఆయన ఇంటి వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలన్న కోరికతోనే తాను 4వేల కిలోమీటర్లు పాద యాత్ర చేపట్టినట్లు జిలానీబాషా తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి హామీ కౌన్సిల్ సభ్యులు ముక్కమళ్ల పుల్లారెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, కంబగిరి తదితరులు ఉన్నారు.

బీమా సొమ్ము అందజేత

కోవెలకుంట్ల: మండలంలోని బిజనవేముల గ్రామానికి చెందిన నరసింహ ఆచారి, సుమిత్ర దంపతులు మూడు నెలల క్రితం వెలుగోడు సమీపంలో ప్రవహిస్తున్న కాల్వలో ప్రమాదవ శాత్తూ పడి మృతి చెందారు. కుటుంబ యజమాని నరసింహ ఆచారి వైఎస్సార్‌బీమా పాలసీదారుడు కావడంతో రూ.5 లక్షల ప్రమాద బీమా వర్తించింది. మృతుని సోదరుడు ఆదిశేషు ఆచారికి బీమా సొమ్మును సోమవారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి సురేంద్రనాథరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, వలంటీర్ వెంకటేష్, ఉసేని పాల్గొన్నారు.

రోడ్డు సమస్యకు పరిష్కారం



గ్రావెల్ రోడ్డు వేసిన దృశ్యం

డోన్ టౌన్: స్థానిక త్రివర్ణ కాలనీలో రోడ్డు సమస్యకు పరిష్కారం లభించింది. చిన్నపాటి వర్షం వచ్చినా కాలనీలో నిలిచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉండేది. సమస్యను కౌన్సిలర్ నాగేంద్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్ సోమవారం కాలనీలో గ్రావెల్ వేసి బాగు చేయించారు.

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

బేతంచెర్ల: స్పందన అర్జీల పట్ల నిర్లక్ష్యం చేయకుండా వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న సిబ్బందికి సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించి పలువురి నుంచి వినతులు స్వీకరించారు. సంబంధిత అధికారులకు పంపి త్వరలో పరిష్కారం చూపుతామని బాధితులకు హామీ ఇచ్చి పంపారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, ఏఓ కిరణ్ కుమార్, ఆర్ఐ శ్రీదేవి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం



లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షులు, కార్యవర్గం సభ్యులు

బేతంచెర్ల: లయన్స్ క్లబ్ పట్టణ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. స్థానిక అమ్మవారి శాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు వెంకట సతీష్, రాఘవేంద్రరాజు, ఉపాధ్యక్షులు ధనుంజయ, ట్రెజరర్‌గా మనోహర్ రెడ్డిని ఎన్నుకుని వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కేబినెట్ సెక్రటరీ రామరాజు, జిల్లా చైర్మన్ చంద్ర శేఖర్, కోఆర్డినేటర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను ప్రారంభించాలి

డోన్ టౌన్: ఉడుములపాడు వద్ద గత ఏడాది మంజూరైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలుర పాఠశాలను ప్రారంభించాలని సర్వజన విద్యార్థి సమాఖ్య(ఎస్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్ కోరారు. సోమవారం స్పందన కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటరెడ్డికి వినతి పత్రం అందించారు. పాఠశాలలు ప్రారంభమై నెలన్నర అవుతున్నా ఇక్కడా ఇంకా తరగతులను ప్రారంభించకపోవడంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదముందని, ఇప్పటికైనా మౌలిక వసతులు కల్పించి, ఉపాధ్యాయులను భర్తీ చేసి తరగతులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మండల అధ్యక్షుడు సుభాష్ తదితరులు ఉన్నారు.

ఉజ్వల భవితకు బాట

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ) ఉపాధ్యాయినులు విద్యార్థినుల ఉజ్వల భవితకు బాట వేస్తున్నారు. ఒక వైపు చదువు నేర్పిస్తూ మరో వైపు విద్యార్థినుల్లోని సృజనాత్మకతను వెలికితీసి అల్లికలపై శిక్షణ ఇస్తున్నారు. చదువుతోపాటు స్వశక్తితో రాణించేందుకు కావాల్సిన తర్ఫీదు ఇస్తున్నారు. ఇప్పటికే నేర్చుకున్న కొందరు విద్యార్థినులు సెలవుల్లో ఇళ్ల వద్ద అల్లికలు, కుట్టు పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. భవిష్యత్తులో బతకడానికి భరోసా దొరికిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.
– బేతంచెర్ల

- కేజీబీవీలో చదువుతోపాటు అల్లికలపై శిక్షణ
- ఇష్టంగా నేర్చుకుంటున్న విద్యార్థినులు



బాలికలు తయారు చేసిన వివిధ రకాల వస్తువులు



బాలికలకు అల్లికలపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయిని

బేతంచెర్ల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 280 మంది విద్యార్థినులు చదువుతున్నారు. 6, 7, 8, 9 10 తరగతి విద్యార్థినులకు చదువుతోపాటు క్రాఫ్ట్‌పై ప్రత్యేక శిక్షన ఇస్తున్నారు. ఉపాధ్యాయురాలు వెంకటలక్ష్మమ్మ వివిధ రకాల అల్లికలు, చీరెలకు ఎంబ్రాయిండింగ్, మగ్గం వర్కు, కుట్టు శిక్షణ, కమ్మల తయారీలో తర్ఫీదు ఇస్తున్నారు. బాలికలు ఆసక్తితో నేర్చుకొని సొంతంగా తయారు చేస్తున్నారు. ఆలయాలకు పూజా సామగ్రిని తీసుకెళ్లే బుట్టలు, తలుపులు, కిటికీల కర్టెన్లు, చీరెలకు ప్రత్యేక మగ్గం వర్కులతో కుచ్చులు, గోడలకు అందాన్ని తెచ్చే వివిధ రకాల అలంకరణ వస్తువులను అలవోకగా తయారు చేస్తున్నారు. వాటితో పాటు కమ్మలు, గాజులు తయారు చేయడంలోనూ నైపుణ్యాన్ని సాధిస్తున్నారు.

బుట్టల తయారీ నేర్చుకున్నా



వివిధ రకాల అల్లికలతో బుట్టల తయారీ నేర్చుకున్నాను. వీటికి తీగలను ఉపయోగిస్తారు. సెలవులకు ఇంటికి వెళ్లినప్పుడుసొంతంగా కొన్ని తయా రు చేసి ఇరుగు పొరుగు వారికి అమ్మడంతో కొంత సంపాదించాను. చదువుతోపాటు ఇలాంటి వాటిని నేర్పటం వల్ల భవిష్యత్‌లో డబ్బు సంపాదించొచ్చు అనే భరోసా కలిగింది.
– రిజ్వానా, 10వ తరగతి

మగ్గం వర్కు నేర్పించారు



పాఠశాలలో ఇస్తున్న ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకొని మగ్గం వర్కును, చీరెలకు కుచ్చులు వేయడం నేర్చుకున్నాను. కమ్మలు, గాజులు తయారు చేయడం కూడా నేర్చుకున్నా. డోర్ కర్టెన్ల తయారు చేస్తా. ఇవన్నీ ఇక్కడే నేర్చుకున్నా. స్వయం ఉపాధికి ఉపయోగ పడే ఇలాంటివి నేర్చుకోవడం నాలాంటి అమ్మాయిలకు భవిష్యత్తులో అండగా ఉంటుంది.
– అశ్వనీ, 10వ తరగతి

సొంతంగా అలంకరణ వస్తువులు



దుస్తులపై సొంతంగా డిజైన్లు వేయడం ఆనందం ఉంది. మా ఇంటి పక్కల వారికి దుస్తులపై అల్లికలు వేసి ఇచ్చాను.కొంత డబ్బు ఇస్తామన్నారు. పూజా సామగ్రికి కావాల్సిన బుట్టల్ని తయారు చేయడం, వాటిపై అల్లికలు, గోడకు అలంకరించే వివిధ వస్తువుల తయారీని నేర్చుకున్నాను.
– మధు రాధ, 10వ తరగతి

అభివృద్ధి పనులపై ఆరా



షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో చేపట్టబోయే అభివృద్ధి పనుల ప్రదేశాలను సోమవారం జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పరిశీలించారు. రామ్‌కో సిమెంట్ సీఎస్ఆర్ నిధులతో బస్టాండ్ ప్రాంగణంలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టనుంది. రెండు వైపులా పంచాయతీ ఆధ్వర్యంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించేందుకు ఇటీవల దుకాణాలను తొలగించారు. కొలతలు వేయించారు. ఏవైపు ఎన్ని షాపులు నిర్మించాలనే వాటిపై చర్చించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి ఉన్నారు.

దరఖాస్తుల వెల్లువ

బనగానపల్లె రూరల్: మూడు అంగన్‌వాడీ వర్కర్లు, ఒక మినీ అంగన్‌వాడీ వర్కర్, నాలుగు ఆయా పోస్టులకు 41 మంది అభ్యర్థినులు దరఖాస్తు చేసుకున్నట్లు సీడీపీఓ రోజారాణి సోమవారం తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్ పోస్టుకు 8, మినీ అంగన్‌వాడీ వర్కర్‌కు 2, ఆయా పోస్టులకు 21 దరఖాస్తులు వచ్చాయన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు

- డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి



జగనన్న లే అవుట్‌కు స్థలాన్ని పరిశీలిస్తున్న డోన్ ఆర్డీఓ వెంకటరెడ్డి

అవుకు: అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందించాలని డోన్ ఆర్డీఓ వెంకట రెడ్డి సూచించారు. మండల పరిధిలోని చెర్లోపల్లె, రామాపురం గ్రామాల జగనన్న లే అవుట్ స్థలాన్ని సోమవారం సాయంత్రం తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. రామాపురంలో 396 మంది లబ్ధిదారుల్లో 203 మందికి గ్రామ సమీపంలో, మిగిలిన 93 మందికి, చెర్లోపల్లె గ్రామంలోని 141 మందికి కలిపి చెర్లోపల్లె గ్రామ సమీపంలోని సంగపట్నం పొలిమేరలో గతంలో జగనన్న లే అవుట్ వేశారు. ఆ లేఅవుట్ శ్మశాన వాటిక పక్కనే ఉందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేయడంతో మరోచోట ఏర్పాటు చేసేందుకు స్థలాలను ఆర్డీఓ పరిశీలించారు. అనంతరం మండల రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడ రికార్డులను పరిశీలించారు. భూ రీ సర్వేపై ఆరా తీశారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగితిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ రాముడు, వీఆర్ఓ పెద్దయ్య, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



ఆకుమల్ల గ్రామంలో కొలువుదీరిన పీర్లు



డోన్ తారకరామ నగర్‌లో కొలువైన పీర్లు

సంజామల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సోమవారం మొహర్రం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. చావిళ్లలో పీర్ల దేవుళ్లను కొలువుంచి ప్రార్థనలు చేశారు. 26 నుంచి మూడు రోజులపాటు జరిగే సరిగెత్తులకు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం చిన్నసరిగెత్తు, గురువారం మధ్య సరిగెత్తు, శుక్రవారం పెద్ద సరిగెత్తు ఉంటుంది. 29న పీర్ల నిమజ్జనంతో మొహర్రం వేడుకలు ముగియనున్నాయి.

కొలిమిగుండ్ల: మత సామరస్యానికి అతీతంగా జరుపుకునే మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లోని పీర్ల చావిళ్లలో పీర్లను కొలువుదీర్చారు. పీర్ల చావిళ్లకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు. మొహర్రం పురస్కరించుకుని విద్యుద్దీపాలతో అలంకరించారు. తిమ్మనాయినపేట, అంకిరెడ్డిపల్లె, బందార్లపల్లె, మీర్జాపురం, నంది పాడు, కనకాద్రిపల్లె తదితర గ్రామాల్లో పీర్లను కొలువుంచారు.

డోన్: మొహర్రం వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని టీఆర్ నగర్‌లో హజరత్ దస్తగిరి పీర్ల స్వామి కొలువయ్యాయి. కొత్తపేట, పాతపేట, రైల్వేకాలనీ, జంగాల వీధి, కేఈ కృష్ణమూర్తి నగర్, ఆర్‌టీసీ కాలనీలతో పాటు పలు గ్రామాల్లోనూ మొహరం వేడుకలను జరుపుకునేందుకు భక్తులు ఏర్పాట్లు చేశారు.

మణిపూర్ నిందితులను శిక్షించాలి



బనగానపల్లెలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

బనగానపల్లె రూరల్: మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం కొవ్వొత్తుల ప్రదర్శన, ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు మాధవస్వామి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు మధుసూదన్‌రావు, నాయకులు రమేష్‌బాబు, వెంకటకృష్ణుడు, పోల్యా నాయక్, కిశోర్, వెంకటేశ్వరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, రఫీ, ఖాద్రీ పాల్గొన్నారు.

ప్యాపిలిలో..

ప్యాపిలి: మణిపూర్ నిందితులను కఠినంగా శిక్షించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్ యాదవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. మణిపూర్ ఘటనను ఖండిస్తూ సోమవారం ప్యాపిలిలో విద్యార్థులతో కలిసి నిరసన నిర్వహించారు. మణిపూర్‌లో మూడు నెలలుగా సాగుతున్న ఘర్షణల్లో దాదాపు 150 మంది బలైనట్లు తెలుస్తోందని, ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఈ ఘటనపై విచారణ చేపట్టి బాధ్యులను శిక్షించాలని డిమాండ్ చేశారు.

నేడు నియోజకవర్గ సమీక్ష సమావేశం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని ధనలక్ష్మి ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నియోజకవర్గ సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అధ్యక్షతన వహిస్తున్న ఈ కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి అంజాద్‌ఖాన్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్‌తో పాటు అధికారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. సమావేశ హాలును ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పరిశీలించారు.

క్రైం కార్నర్

నాటుసారా విక్రేతల అరెస్టు

బేతంచెర్ల: ఇద్దరు నాటా సారా విక్రేతలను సోమవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శివశంకర్ నాయక్ తెలిపిన వివరాలు.. ఎం.పెండేకల్లు గ్రామంలో నాటు సారా విక్రయిస్తున్న ఓర్వకల్లు మండలం కొమరోలు శివశంకర్‌ను, పట్టణంలోని హనుమాన్ నగర్‌లో సారా విక్రయిస్తున్న మాసపాడు ఎరుకలి సుంకులమ్మను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 20, 10 లీటర్ల చొప్పున మొత్తం 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టరు సీజ్

డోన్ టౌన్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును సెబ్ అధికారులు సీజ్ చేయగా యజమాని భీమేష్ రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. సోమవారం జాతీయ రహదారి నుంచి వ్యవసాయ మార్కెట్ వైపు పట్టణంలోకి ప్రవేశిస్తున్న ఇసుక ట్రాక్టరును సెబ్ అధికారులు ఆపి తనిఖీ చేశారు. అనుమతులు లేక పోవడంతో అదుపులోకి తీసుకుని పట్టణ పోలీసు స్టేషన్‌కు తరలించగా కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనుల పరిశీలన



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రాజేష్

డోన్: స్థానిక 21వ వార్డులో కౌన్సిలర్ షాధిక్ ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం మునిసిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పరిశీలించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికులు మురుగు కాలువ, కల్వర్టు, సీసీ రోడ్డు ఏర్పాటు చేయాలని కోరడంతో నిధులు మంజూరు చేశామన్నారు. అలాగే పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి విద్యుత్ సౌకర్యం కల్పించామన్నారు. ప్రాధాన్యతక్రమంలో అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఆయన వెంట కమిషనర్ వెంకట్రామిరెడ్డి, మునిసిపల్ వైస్‌చైర్మన్ జాకీర్‌హుసేన్, ఏఈ సురేష్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షులు పోస్టు ప్రసాద్ ఉన్నారు.

26న స్వాతి వేడుకలు

బనగానపల్లె రూరల్: పట్టణంలోని రవ్వలకొండపై వెలసిన చెంచులక్ష్మి సమేత పావన నరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 26న స్వాతి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ వ్యవస్థాపకులు బాలిశెట్టి పావన నరసింహమూర్తి సోమవారం తెలిపారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం దాత కర్నూలు లోక్ అదాలత్ జడ్జి హరినాథ్ సతీమణి సుజాతమ్మ సహకారంలో అన్నదాన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ముస్లింల అంగీకారంతోనే షాదీఖానాకు బీపీ శేషారెడ్డి పేరు



మాట్లాడుతున్న ముస్లిం మైనార్టీ నాయకులు

బేతంచెర్ల: ముస్లింల అంగీకారంతోనే షాదీఖానాకు బీపీ శేషారెడ్డి పేరు పెట్టినట్లు ఉర్దూ అకాడమీ సభ్యులు మూర్తుజావలీ, స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్ తెలిపారు. సోమవారం శ్రీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2002లో అప్పటి ఎమ్మెల్యే బిజ్జం పార్థసారధి రెడ్డి హయాంలో షాదిఖానా నిర్మాణం రూ.7.50 లక్షలు మంజూరు కాగా గోడల వరకు మాత్రమే పూర్తయిందన్నారు. ఎంపీ ఎస్పీవై రెడ్డి రూ.15 లక్షలు, 2018లో ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి రూ.15 లక్షలు మంజూరు చేయించినా నిధులు సరిపోలేదన్నారు. దీంతో బుగ్గన తన సొంత నిధులు మరో రూ.20 లక్షలు ఖర్చు చేసి షాదిఖానా నిర్మాణం పూర్తి చేయించారన్నారు. అందుచేతనే ముస్లింల అంగీకారంతోనే బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తాత రావు బహదూర్ బీపీ శేషారెడ్డి పేరు షాదిఖానాకు పెట్టినట్లు చెప్పారు. ఇవన్నీ తెలుసుకోకుండా కొందరు అవగాహనా రాహిత్యంతో మాట్లాడటం తగదని హితవు పలికారు.సమావేశంలో ముస్లిం మైనార్టీ నాయకు లు అబ్దుల్ ఘనీ,అహ్మద్ హుసేన్, సాధిక్, ఖా జా, దస్తగిరి, మగ్బుల్, సంధానీ, హుస్సేన్ పీరా, పిట్టల సుభహాన్, షేక్ హుసేన్, ఆజామ్ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

బేతంచెర్ల: ఈనెల 27న రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ మొదటి విడత నగదు జమ అవుతుందని ఏఓ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈకేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్ నగదు పడుతుందన్నారు. ఇప్పటి వరకు 8,112 మంది రైతులు ఈకేవైసీ చేయించుకున్నారని, వీరి జాబితా ఆర్బీకేల ఆవరణంలో ఉంచామన్నారు. పేర్లు లేని వారు త్వరగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

వైద్యం..మరింత చేరువ

- నియోజకవర్గంలో 78 హెల్త్‌క్లినిక్‌లు
- పల్లెల ముంగిటకే వైద్య సేవలు

వైద్యాన్ని ప్రభుత్వం పేదల చెంతకు చేరుస్తోంది. సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ఇప్పటికే ప్రజల ముంగిటకు తెచ్చిన ప్రభుత్వం.. మరోఅడుగు ముందుకేసి వైద్యం పల్లెల్లోనే అందేలా చర్యలు తీసుకుంది. అందులో భాగంగా ప్రతి 2,500 జనాభాకు ఒక వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు, వైద్యపరీక్షలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆయాతో పాటు ఆశా వర్కర్, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్లను నియమించింది. ఇకపై చిన్న, చిన్న జబ్బులకు కూడా 10–15 కిలోమీటర్ల దూరంలో ఉండే పీహెచ్‌సీలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు.
– బనగానపల్లె



యాగంటిపల్లె విలేజ్ క్లినిక్‌లో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నియోజకవర్గంలో 78 హెల్త్ క్లినిక్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది వీటిలో 53 హెల్త్ క్లినిక్‌లకు నూతన భవనాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.10.40 కోట్ల నిధులను మంజూరు చేసింది. ఇందులో 12 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులు పూర్తయి వీటిలో వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన హెల్త్ క్లినిక్‌ల నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నందున వచ్చే నెల చివర నాటికి పూర్తవుతాయని అధికారులు పేర్కొంటున్నారు. హెల్త్ క్లినిక్‌లలో 12 రకాల వైద్యసేవలు అందించడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. 105 రకాల మందులు అందుబాటులో ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం పతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం అమలులో విలేజ్ క్లినిక్‌లు కేంద్ర బిందువులుగా ఉంటున్నాయి. విలేజ్ క్లినిక్ యూనిట్‌గా ప్రతి గ్రామాన్ని పీహెచ్‌సీ వైద్యులు నెలలో రెండు సార్లు సందర్శిస్తారు. ఇక్కడ ఫ్యామిలీ డాక్టర్ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. గ్రామస్థాయిలోనే వైద్య సేవల కల్పనకు ఈ విధమైన పటిష్టమైన వ్యవస్థలు ఉండడం వల్ల చాలా వరకు ఆరోగ్య సమస్యలకు గ్రామాల్లోనే పరిష్కారం లభించనుంది. బీపీ, షుగర్ తదితర జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించగలుగుతున్నారు.

హెల్త్ క్లినిక్‌లో సేవలు..

గ్రామీణ ప్రాంతాల వృద్ధులు, గర్భిణులకు నిరంతరం వైద్య బృందం అందుబాటులో ఉంటూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో 24 గంటలు వైద్య బృందం అందుబాటులో ఉంటున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో ఆరోగ్యశ్రీ వైద్యం చేయించుకున్న రోగులను పక్షవాతం ఇతర రోగాలతో మంచానికి పరిమితమైన కేంద్రాల వద్దకు రాలేని పరిస్థితుల్లో ఉన్న రోగులను పరీక్షించేందుకు ఇంటి వద్దకు వెళ్లి వైద్యులు సేవలందిస్తారు. 24 గంటలు వైద్యసేవలందించేందుకు ఎంఎల్‌హెచ్‌పీతో పాటు గ్రామ సచివాలయ ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు అందుబాటులో ఉంటున్నారు. సుమారు 2–3వేల జనాభా కలిగిన ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో విలేజ్ హెల్త్‌క్లినిక్ ఉంటుంది. సొంతభవనాలు పూర్తికాని చోట గ్రామ సచివాయల్లోను అద్దె భవనాల్లో హెల్త్‌క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. ఆయా సెంటర్ల పరిధిలో ప్రతి నెల రెండు పర్యాయాలు ప్రభుత్వం నియమించిన వైద్యులు 104 వాహనం ద్వారా వచ్చి వైద్యసేవలందిస్తున్నారు. అక్కడ వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందిస్తున్నారు. హెల్త్‌క్లినిక్‌లలో యూరిన్, బ్లడ్, షుగర్, మలేరియా, హెచ్‌ఐవీ, డెంగీ, కంటి పరీక్షలు, అయోడిన్ సాల్ట్ పరీక్షలు, వాటర్ టెస్టింగ్ తదితర 14 ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు.

మా ఊర్లోనే మందులిస్తున్నారు



నాకు బీపీ, షుగర్ ఉన్నాయి. బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మందులు తెచ్చుకునేదాన్ని. వెళ్లినప్పుడల్లా చార్జీల ఖర్చులతో పాటు ఎవరో ఒకరు తోడుగా రావాల్సి వచ్చేది. ప్రస్తుతం మా గ్రామంలో వైఎస్సార్ క్లినిక్ ఏర్పాటు కావడంతో ఊరిలోనే వైద్యసేవలు అందుతున్నాయి. బీపీ, షుగర్ పరీక్షలు చేసి మందులు ఇస్తున్నారు.
– ఎస్ అరుణదేవి, పసుపల, బనగానపల్లె మండలం

వైద్యసేవలు ఉపయోగించుకోవాలి



విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా లభిస్తున్న వైద్య సేవలు గ్రామాల ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలి. హెల్త్‌క్లినిక్‌లలో వైద్యపరీక్షలు వైద్య సేవలతో పాటు మందులు అందుబాటులో ఉన్నాయి. గతంలో వైద్య సౌకర్యం కోసం పీహెచ్‌సీలకు కమ్యూనిటీ ఆసుపత్రులకు జిల్లా కేంద్రాలకు వెళ్లేవారు. నేడు ప్రతి గ్రామంలో హెల్త్ క్లినిక్‌లు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల వెళ్లాల్సిన అవసరం ఉండదు. సొంత గ్రామంలోనే వైద్య సౌకర్యం లభిస్తోంది.
– సోహైల్‌బాబు, వైద్యాధికారి, టంగుటూరు పీహెచ్‌సీ

ఈరోజు

నేడు జగనన్న సురక్ష

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ పంచాయతీలోని ఐదవ గ్రామ సచివాలయ ఆవరణలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాధిక సోమవారం తెలిపారు. అన్ని అర్హతలు ఉండి ఇప్పటి వరకు సంక్షేమ పథకాలు అందని లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తామన్నారు. సదస్సులో లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేస్తామన్నారు.

బెలుం, బి.ఉప్పలూరులో..

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం, బి.ఉప్పలూరు గ్రామ సచివాలయాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. తహసీల్దార్ డోనీ ఆల్‌ఫ్రెడ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారన్నారు.

విద్యాసంస్థల బంద్

ప్యాపిలి: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం విద్యాసంస్థల బంద్ చేపడుతున్నట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రతాప్ తెలిపారు. సోమవారం ప్యాపిలిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాని కోరారు.